ప్రజలంతా సుభిక్షంగా ఉండాలి

- ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి



కప్పాడులో వెంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే రంగారెడ్డి

ఇబ్రహీంపట్నంరూరల్, ఏప్రిల్ 4 : భగవంతుడి కృపతో ప్రజలంతా సుభిక్షంగా ఉండాలని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. మండల పరిధిలోని కప్పాడు గ్రామంలో గురువారం నిర్వహించిన పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామి కల్యాణ మహోత్సవంలో ఆయన పాల్గొని పూజలు చేశారు. భక్తి భావాన్ని అలవర్చుకోవాలని సూచించారు. ఎమ్మెల్యే రంగారెడ్డిని ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ఘనంగా అయ్యప్ప విగ్రహ ప్రతిష్ఠాపన

తుర్కయాంజాల్ : తుర్కయాంజాల్ మున్సిపాలిటీ పరిధిలోని నూతనంగా నిర్మించిన హరిహర పుత్ర అయ్యప్ప స్వామి ఆలయంలో అయ్యప్ప విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి ముఖ్యఅతిథిగా ఆలయంలో పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మట్లాడుతూ తుర్కయాంజాల్ ప్రాంతంలో అయ్యప్ప ఆలయాన్ని నిర్మించడం సంతోషకరమన్నారు. అంతకుముందు డీసీసీబీ చైర్మన్ కొత్తకుర్మ సత్తయ్య విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమంలో కుటుంబ సభ్యులతో కలిసి పాల్గొని పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

ఆలయానికి విరాళం అందజేత..

మున్సిపాలిటీ కౌన్సిలర్ కొశికె ఐలయ్య అయ్యప్ప దేవాలయానికి రూ.2,00116 లను విరాళంగా అందజేశారు. త్రిదండి అష్టక్షారి సంపత్‌కుమార రామానుజ జీయర్, హనుమాను దీక్షితులు దేవాలయ కమిటీ సభ్యులకు నగదును అందజేశారు.

దేవాలయ కమిటీ సభ్యులకు విరాళం అందజేస్తున్న కౌన్సిలర్ అయిలయ్య

రూ.280చేరిన చికెన్ ధర

ఇబ్రహీంపట్నంరూరల్, ఏప్రిల్ 4 : చికెన్ ధరలు కొండెక్కుతున్నాయి. వేసవి ఎండలు దంచికొడుతున్నందున కోళ్ల ఉత్పత్తి పెద్ద ఎత్తున తగ్గిపోయింది. ముఖ్యంగా వేసవికాలంలో కోళ్ల ఉత్పత్తులు తగ్గి పెద్ద ఎత్తున మృత్యువాతకు గురయ్యే ప్రమాదమున్నది. వ్యాపారులు కోళ్ల పెంపకంపై ఈ మూడునెలల పాటు మక్కువ చూపకపోవటంతో ఉత్పత్తి ఒక్కసారిగా తగ్గిపోయింది. దీంతో ధరలు మార్కెట్‌లో రోజురోజుకూ పెరుగుతూనే ఉన్నాయి. ముఖ్యంగా గ్రామీణ, పట్టణ ప్రాంత ప్రజలు ప్రస్తుతం కూరగాయల కంటే ఎక్కువగా చికెన్‌ను ఇష్టపడుతున్నారు. ఈ తరుణంలో చికెన్ ధరలు రోజురోజుకూ చుక్కలు చూపిస్తుండటంతో సామాన్య ప్రజలు వెనుకడుగు వేస్తున్నారు. పెరిగిన ధరలతో పేద, మధ్యతరగతి కుటుంబాలకు చికెన్ అందని ద్రాక్షలా మిగిలింది. వేసవికాలం కావడంతో ధరలు అమాంతం పెరుగుతున్నాయి. గత పది రోజుల క్రితం రూ.230ఉండగా, రోజుకు పదిరూపాయల చొప్పున పెరుగుతూ నేడు రూ.280లకు చేరింది. ఈ ఏడాది చికెన్ ధరలు విపరీతంగా పెరిగిపోవడంతో ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు.

దేవాలయాల అభివృద్ధికి కృషి

బొడ్రాయి ఉత్సవాలకు రూపాయలు లక్ష అందజేస్తున్న జడ్పీటీసీ అవినాశ్‌రెడ్డి

షాబాద్, ఏప్రిల్ 4: దేవాలయాల అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తామని జడ్పీటీసీ పట్నం అవినాశ్‌రెడ్డి అన్నారు. గురువారం మండల పరిధిలోని రుద్రారం గ్రామంలో నిర్వహిస్తున్న బొడ్రాయి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమంలో పాల్గొని పూజలు నిర్వహించారు. అనంతరం బొడ్రాయి ఉత్సవాలకు తన వంతు సహాయంగా రూ.లక్ష అందజేశారు. కార్యక్రమంలో విష్ణువర్ధన్ రెడ్డి, నర్సింహులు, సంజీవరెడ్డి, సతీశ్ పాల్గొన్నారు.

మాదిగలను విస్మరిస్తున్న కాంగ్రెస్

సమావేశంలో మాట్లాడుతున్న పెంటనోళ్ల రవికుమార్ మాదిగ

కొత్తూరు, ఏప్రిల్ 4: మాదిగలపై కాంగ్రెస్ పార్టీ చిన్నచూపు చూస్తున్నదని ఎమ్మార్పీఎస్ షాద్‌నగర్ నియోజవర్గ అధ్యక్షుడు పెంటనోళ్ల రవికుమార్ అన్నారు. రవికుమార్ అధ్యక్షతన నియోజకవర్గ ఎమ్మార్పీఎస్ సమావేశం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా పెంటనోళ్ల రవికుమార్ మాట్లాడుతూ 17 పార్లమెంట్ నియోజకవర్గాల్లో ఒక్కటి కూడా మాదిగలకు కేటాయించలేదని విమర్శించారు. సీఎం రేవంత్‌రెడ్డి పూర్తిగా మాలల చేతుల్లో బందీ అయిపోయాడని ఆరోపించారు. 75 శాతం మాదిగల జనాభాకు ఒక్క సీట్లో కూడా పోటీ చేసే అర్హత లేదా అని ఆయన ప్రశ్నించారు. కడియం శ్రీహరి 40 ఏండ్లలో ఒక మాదగి బిడ్డను కూడా రాజకీయంగా ఎదుగనీయలేదని ఆరోపించారు. తన తర్వాత కూడా తన కూతురుకు ఎంపీ సీటు ఇప్పించి మళ్లీ మాదిగలకు అన్యాయం చేశారని వాపోయారు. మాదిగకులస్తులు కడియం కావ్యను గ్రామాల్లో ఎక్కడికక్కడ అడ్డుకొని చిత్తుచిత్తుగా ఓడిస్తామని చెప్పారు. సమావేశంలో ఎమ్మార్పీఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి రామచంద్రయ్యమాదిగ, నాయకులు చిన్నగళ్ల అశోక్‌కుమార్ మాదిగ, గంగయ్యమాదిగ, అనిల్‌మాదిగ, యాదయ్య మాదిగ పాల్గొన్నారు.

గ్రామీణుల స్థితిగతులను తెలుసుకోవాలి

- సీజీఆర్ వ్యవస్థాపకురాలు లీలమ్మ
- అన్మాస్‌పల్లి ఎర్త్ సెంటర్‌లో విద్యార్థులకు ముగిసిన అవగాహన సదస్సు



అవగాహన సదస్సులో పాల్గొన్న విద్యార్థులతో సీజీఆర్ వ్యవస్థాపకురాలు లీలమ్మ

కడ్తాల్, ఏప్రిల్ 4: విద్యార్థులు గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజల స్థితిగతులు, జీవన విధానాన్ని తెలుసుకోవాలని సీజీఆర్ వ్యవస్థాపకురాలు కోర్పోలు లీలమ్మ అన్నారు. మండల పరిధిలోని అన్మాస్‌పల్లి గ్రామంలోని ఎర్త్ సెంటర్, తెలంగాణ విశ్వవిద్యాలయం దక్షిణ ప్రాంగణం డిపార్ట్‌మెంట్ ఆఫ్ సోషల్ వర్క్ విభాగం విద్యార్థులు, కౌన్సిల్ ఫర్ ఎర్త్ లీడర్‌షిప్ అండ్ సస్టెనబిలిటీ– సీజీఆర్ సంయుక్త ఆధ్వర్యంలో గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజల జీవన విధానంపై మూడు రోజులుగా నిర్వహించిన అవగాహన సదస్సు గురువారం ముగిసింది. చివరి రోజు జరిగిన కార్యక్రమంలో లీలమ్మ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఎర్త్ సెంటర్ ఆధ్వర్యంలో ప్రజలతో మమేకమై వారి జీవన విధానం తెలుసుకోవడం, ఆర్థిక స్థితిగతులు, ఆచార వ్యవహారాలు, విద్య–వైద్యం, వ్యవసాయంపై విద్యార్థులకు వివరించినట్లు తెలిపారు. విద్యార్థులకు ప్రజలతో ఎలా భాగస్వామ్యాన్ని పెంపొందించుకోవాలి, గ్రామీణ నివాసిత జీవితాలను మెరుగుపరచడానికి ఏయే అంశాలు దోహదం చేస్తాయే వివరించినట్లు పేర్కొన్నారు. గ్రామాల్లో బలమైన స్వయం సహాయక సంఘాల ద్వారా, వ్యవసాయ క్షేత్రాల ద్వారా యువతకు కావాల్సిన మార్గాలతో నూతన విధానాలపై అవగాహన కల్పించామన్నారు. వ్యవసాయరంగంలో ప్రకృతి పరమైన సేంద్రియ పద్ధతులను వివరించినట్లు తెలిపారు. అదే విధంగా పర్యావరణ పరిరక్షణపై విద్యార్థులకు విలువైన సూచనలను చేశామన్నారు. కార్యక్రమంలో తెలంగాణ విశ్వవిద్యాలయ సోషల్ వర్క్ హెడ్ ఆఫ్ ది డిపార్ట్‌మెంట్ డాక్టర్ రాజేశ్వరి మాట్లాడుతూ సీజీఆర్ అందించిన సహకారం విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు. పర్యావరణ పరిరక్షణకు సీజీఆర్ ఆధ్వర్యంలో చేపడుతున్న కార్యక్రమాలు అభినందనీయమని పేర్కొన్నారు. కార్యక్రమంలో విశ్వవిద్యాలయ సహ ఆచార్యులు యాలాద్రి, రమాదేవి, పర్యావరణ శాస్త్రవేత్త ఉమామహేశ్వర్‌రెడ్డి, ప్రోగ్రాం ఆఫీసర్ వెంకటేశ్, నగేశ్, బాల చైతన్య కేంద్రాల నిర్వాహకుడు రజినీకాంత్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

గోర్ బంజారా ప్రీమియర్ లీగ్ బ్రోచర్ ఆవిష్కరణ

జీబీపీఎల్ క్రికెట్ టోర్నమెంట్ బ్రోచర్ విడుదల చేస్తున్న గిరిజన సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు హన్మానాయక్

కడ్తాల్, ఏప్రిల్ 4: గోర్ బంజారా ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జీబీపీఎల్ 2024 క్రికెట్ టోర్నమెంట్‌కు సంబంధించిన బ్రోచర్‌ని గిరిజన సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు హన్మానాయక్ ఆవిష్కరించారు. గురువారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రాష్ట్ర గిరిజన సంఘం నాయకులతో కలిసి ఆయన బ్రోచర్‌ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా హన్మానాయక్ మాట్లాడుతూ ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని యువతను ప్రోత్సహించడానికి గోర్ బంజారా ఆధ్వర్యంలో క్రికెట్ టోర్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మహబూబ్‌నగర్ పట్టణంలో ఈ నెల 12న టోర్నీ ప్రారంభవుతుందని, ఆసక్తిగల క్రీడాకారులు తమ జట్ల వివరాలను తెలపాలని ఆయన వివరించారు. కార్యక్రమంలో గిరిజన సేవా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బలరాంనాయక్, రాష్ట్ర కమిటీ సభ్యులు లక్ష్మణ్‌నాయక్, రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు భీమ్‌రావునాయక్, జీబీపీఎల్ చైర్మన్ రవిరాథోడ్, కమిటీ సభ్యులు నరేశ్‌నాయక్, పున్యానాయక్, మోహన్‌నాయక్ పాల్గొన్నారు.

ప్రతి విద్యార్థి రెండు మొక్కలు నాటాలి

పెద్దఅంబర్‌పేట, ఏప్రిల్ 4: ప్రతి విద్యార్థి రెండు మొక్కలు నాటాలని అవేక్ అగ్రికల్చర్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ (ఆర్డ్స్) కోఆర్డినేటర్ మోడపు సత్యనారాయణగౌడ్ అన్నారు. పెద్దఅంబర్‌పేట జడ్పీహెచ్ పాఠశాల, కుంట్లూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అర్బన్ మూమెంట్ ఇన్నోవేషన్ ఫండ్ సహకారంతో విద్యార్థులకు వాతావరణ మార్పులపై అవగాహన కల్పించారు. పాటలతో విద్యార్థుల్లో చైతన్యం నింపారు. గాలి, నీరు ఎలా కాలుష్యం అవుతున్నదని, దాన్ని నివారించేందుకు విద్యార్థి దశ నుంచే ఎలా స్పందించాలో వివరించారు. ప్రతి ఇంట్లో ఇంకుడు గుంతను నిర్మించుకునేలా అవగాహన కల్పించాలని సూచించారు. ఆయా కార్యక్రమాల్లో హెచ్ఎం శ్రీనివాసరావు, విష్ణుమూర్తి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో సంధ్య

నీటి ఎద్దడి నివారణకు సహకరించాలి

మొయినాబాద్, ఏప్రిల్ 4 : నీటి ఎద్దడి రాకుండా నీటిని పొదుపుగా వాడుకోవాలని, ఇందుకు ప్రజలు సహకరించాలని ఎంపీడీవో సంధ్య అన్నారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో మంచినీటి సరఫరాపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గ్రామాల్లో మంచినీటి సమస్య ఉన్నా వెంటనే గుర్తించి చర్యలు తీసుకోవడానికి ప్రత్యేక ప్రణాళికలు రూపొందించుకోవాలన్నారు. మిషన్ భగీరథ మంచినీళ్లు రావడంతో పాటు గ్రామ పంచాయతీ పరిధిలోని మంచినీటి బోరు బావులను మరమ్మతులు చేయించి సిద్ధంగా పెట్టుకోవాలన్నారు. ప్రత్యేక పరిస్థితుల్లో ఎక్కడైనా మిషన్ భగీరథ మంచినీటికి అంతరాయం ఏర్పడితే మంచినీళ్ల బోర్ల ద్వారా నీటిని సరఫరా చేసే విధంగా ఉండాలన్నారు. మం చినీటి సమస్యను తెలుసుకోవడానికి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ప్రత్యేక కాల్ సెంటర్‌ను ఏర్పాటు చేశారని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీవో వెంకటేశ్వర్‌రెడ్డి, కార్యదర్శులు పాల్గొన్నారు.

కుంట్లూరు పాఠశాలలో అవగాహన కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సంస్థ ప్రతినిధులు

భారీ మెజార్టీతో కాసాని గెలుపు ఖాయం

చేవెళ్లటౌన్, ఏప్రిల్ 4 : చేవెళ్ల పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ భారీ మెజార్టీతో గెలుపొందడం ఖాయమని బీఆర్ఎస్ పార్టీ చేవెళ్ల మండల అధ్యక్షుడు పెద్దోళ్ల ప్రభాకర్ తెలిపారు. గురువారం చేవెళ్లలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. బీఆర్ఎస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు చేపట్టిన సంక్షేమ పథకాలే పార్టీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ అధిక మెజార్టీతో గెలుపొందడం ఖాయమన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీల పేరుతో ప్రజలను మోసం చేస్తున్నదన్నారు. ఈ ఎన్నికలో కాంగ్రెస్, బీజేపీలకు ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని తెలిపారు. కాసాని గెలుపు కోసం పార్టీ కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని అన్నారు. ప్రజలు కారు గుర్తుకు ఓటు వేసి జ్ఞానేశ్వర్‌ను గెలిపించాలని కోరారు.

పేద జంటకు వివాహం

ఎల్బీనగర్, ఏప్రిల్ 4 : మొగుళ్లపల్లి యువసేన ఆధ్వర్యంలో మరో పేద జంటకు గురువారం ఉచిత వివాహం జరిపించారు. యువసేన ఆధ్వర్యంలో ఇది 213వ ఉచిత వివాహం. మొగుళ్లపల్లి ఉపేందర్ గుప్తా ఆధ్వర్యంలో యువసేన ప్రతినిధులతో పాటు దాతల సహకారంతో వరుడు సందీప్, వధువు సుమన వివాహాన్ని దిల్‌సుఖ్‌నగర్‌లోని వీరవేంకట సత్యనారాయణ స్వామి ఆలయంలోని హాల్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ వివాహానికి ఈటెల రాజేందర్ సతీమణి జముజ, చిదర రమేశ్, పులిగిల్ల రమేశ్, బాల్‌రెడ్డి, మహేశ్, రంగయ్య, కాశీనాథ్, కృష్ణమూర్తి, విజయ్, చంద్రమౌళి, శ్రీనివాస్, అరుణ్, వెంకటేశం, ఆంజనేయులు, మురళి యువసేన ప్రతినిధులు సత్యనారాయణ, రాఘవరెడ్డి, రాజన్న, శ్రావణ్, సాయి, మనోజ్, ఆనంద్ తదితరులు పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు.

పుస్తె మెట్టెలు అందజేత

షాద్‌నగర్‌రూరల్, ఏప్రిల్ 4: ఫరూఖ్‌నగర్ మండలంలోని కంసాన్‌పల్లి గ్రామంలో నిరుపేద కుంటుంబనికి చెందిన రవి వివాహానికి గ్రామ మాజీ సర్పంచ్ పద్మానరేందర్‌రెడ్డి పుస్తె మెట్టెలను గురువారం అందజేశారు. ప్రతి ఒక్కరూ నిరుపేదలకు సాయం అందించాలని కోరారు.

చలివేంద్రాల ఏర్పాటు

అభినందనీయం

వనస్థలిపురం, ఏప్రిల్ 4 : బాటసారుల దాహం తీర్చేందుకు చలివేంద్రాలను ఏర్పాటు చేయడం అభినందనీయమని సెన్సార్ బోర్డు సభ్యుడు కృష్ణదాస్ అన్నారు. బీఎన్‌రెడ్డి నగర్ బస్టాప్‌లో గద్దె విజయ్ నేత ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చలివేంద్రాలు, మజ్జిగ కేంద్రాలు ఏర్పాటు చేయడం మన సంస్కృతిలో భాగమన్నారు. ఎండలు విపరీతంగా పెరుగుతున్నందున ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలన్నారు. క్రమం తప్పకుండా నీరు తాగాలన్నారు. తప్పనిసరి అయితేనే బయటికి వెళ్లాలని సూచించారు. చిన్న పిల్లలను ఎండలోకి వెళ్లనీయ వద్దని కోరారు. కార్యక్రమంలో పీవీ చౌదరి, పాండు, గిరి , పద్మ, శేఖర్, రాజు, మధు, గిరి, ప్రవీణ్ పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేయాలి

- ఎల్బీ నగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి

హయత్‌నగర్, ఏప్రిల్ 4 : డివిజన్‌లో చేపడుతున్న అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. గురువారం హయత్‌నగర్ డివిజన్ పరిధిలోని శారదనగర్ కాలనీ కమ్యూనిటీ హాల్ పై నిర్మిస్తున్న అదనపు గదుల స్లాబ్ నిర్మాణ పనులను ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దాదాపు రూ. 98 లక్షల వ్యయంతో అదనపు అంతస్తు నిర్మిస్తున్నట్లు తెలిపారు. కాగా కింది అంతస్తులో సీనియర్ సిటిజన్స్ కోసం అదనపు వసతులు కల్పించాలని, స్థానికంగా గ్రంథాలయం ఏర్పాటు చేయాలని కాలనీవాసులు ఎమ్మెల్యేను కోరారు. శారదనగర్ కాలనీ ఫేస్–2 లో పార్క్ ఎత్తు తక్కువగా ఉండటంతో అందులో అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నాయని, పార్క్ ఎత్తు పెంచి గ్రిల్స్ ఏర్పాటు చేయాలని విన్నవించారు. స్పందించిన ఎమ్మెల్యే సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ హయత్‌నగర్ డివిజన్ అధ్యక్షుడు చెన్నగోని శ్రీధర్ గౌడ్, సీనియర్ నాయకులు భాస్కర్, సాగర్, కాలనీవాసులు నర్సింహారావు, సుబ్బారెడ్డి, సుధాకర్, ఇందిర, అరుణ, శ్రీనివాస్‌రావు, రాఖీ గౌడ్, సీనియర్ సిటిజన్స్ హనుమంతరావు, జగన్నాథరావు, నాయకులు ఇంద్రక రణ్‌రెడ్డి, చుక్కల్, మధు పాల్గొన్నారు.



శారదనగర్ కమ్యూనిటీ హాల్‌పై నిర్మిస్తున్న అదనపు గదుల పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి

మానవత్వం చాటిన ఎమ్మెల్యే సబితారెడ్డి

- రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తిని ఆసుపత్రికి తరలింపు

క్షతగాత్రుడిని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి

కందుకూరు. ఏప్రిల్ 4 : మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి మానవత్వం చాటుకున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి.. ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి గురువారం మండలంలో వివిధ గ్రామాల్లో జరిగిన వివాహాలకు హాజరై వస్తున్నారు. ఈ నేపథ్యంలో బైరాగిగూడ గేటు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో రాచులూరు గ్రామానికి చెందిన కుమ్మరి రమేశ్ గాయపడ్డాడు. గమనించిన ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి తన వాహనాన్ని ఆపి ప్రమాదానికి గురైన వ్యక్తి వద్దకు వెళ్లి తాగునీరు అందించారు. ప్రమాద విషయం తెలుసుకుని మెరుగైన వైద్యం కోసం ఆసుపత్రికి తరలించారు. ఎమ్మెల్యే వెంట మార్కెట్ చైర్మన్ సురుసాని సురేందర్‌రెడ్డి. ఎంపీటీసీల ఫోరం మండలాధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి, కార్తిక్. దీక్షిత్‌రెడ్డి, వెంకటేశ్, సుదర్శన్‌రెడ్డి, కృష్ణారెడ్డి, బీఆర్ఎస్ కార్యకర్తలు ఉన్నారు.

సదరం క్యాంపు దరఖాస్తుల ఆహ్వానం

శంషాబాద్ రూరల్, ఏప్రిల్ 4: సదరం క్యాంపు కోసం దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీవో మున్ని గురువారం తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రంగారెడ్డి జిల్లాలోని దివ్యంగులు సదరం క్యాంపు కోసం దరఖాస్తులు చేసుకోవడానికి ఈనెల 8న ఉదయం 11 గంటలకు ఆన్‌లైన్ ద్వారా స్లాట్ బుక్ చేసుకోవాలని పేర్కొన్నారు. దరఖాస్తు చేసుకున్న వారు సూచించిన దవాఖానకు వెళ్లి ఇక్కడి నుంచి డాక్టర్ సర్టిఫికెట్ తీసుకోవాలన్నారు. కొండాపూర్, వనస్థలిపురంలోని దవాఖానల్లో క్యాంపు ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. ఆధార్, రేషన్ కార్డులను తప్పనిసరిగా తీసుకురావాలన్నారు.

పేరుకుపోయిన వ్యర్థాలు.. దుర్వాసనతో అవస్థలు

- పట్టించుకోని జీహెచ్ఎంసీ అధికారులు, ప్రజాప్రతినిధులు

రామకృష్ణాపురం రోడ్డు నంబర్ 2 ఖాళీ స్థలంలో పేరుకుపోయిన చెత్త

ఆర్కేపురం, ఏప్రిల్ 4 : ఆర్కేపురం డివిజన్ రామకృష్ణాపురం రోడ్డు నంబర్ 2లోని ఖాళీ స్థలంలో చెత్త, వ్యర్థాలు పేరుకుపోయి డంప్ యార్డులా మారి దుర్వాసన వెదజల్లుతున్నది. పక్కనే పార్కు ఉండడంతో అక్కడికి వచ్చే వారు వాసన భరించలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రతి రోజూ చెత్త తరలించకపోవడంతో పేరుకుపోయి దోమలు వ్యాప్తి చెంది జ్వరాలు వస్తున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయాన్ని స్థానిక ప్రజాప్రతినిధులు, జీహెచ్ఎంసీ అధికారులు, కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లినా ఎవరూ పట్టించుకోవడం లేదని పేర్కొంటున్నారు.

పెరుగుతున్న దోమల వలన రాత్రి సమయంలో కునుకు పట్టడం లేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఓపెన్ స్థలంలో చెత్త, వ్యర్థాలు వేయవద్దని నిబంధనలు ఉన్నప్పటికీ ఎవరూ పట్టించుకోవడంలేదు. ఇప్ప టికైనా జీహెచ్ఎంసీ అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకొని తక్షణం చెత్తనుంచి విముక్తి కలిగించాలని స్థానికులు, కాలనీ వాసులు కోరుతున్నారు.

శ్మశానవాటికలో అక్రమ నిర్మాణాల తొలగింపు

మణికొండ, ఏప్రిల్ 4: మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని శ్మశానవాటికలో అక్రమంగా వెలసిన నిర్మాణాలను గురువారం గండిపేట రెవెన్యూ అధికారులు కూల్చివేశారు. విలువైన భూమిని ఆక్రమించేందుకు కొంతమంది యత్నిస్తున్న క్రమంలో స్థానికులు స్పందించి జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో కలెక్టర్ ఆదేశాల మేరకు ఎట్టకేలకు అక్రమ నిర్మాణాల కూల్చివేతలను అధికారులు చేపట్టారు.